## 346 వ అధ్యాయం

## ٣٤٦ ـ بَابُ تَحْرِيمِ الْوِصَالِ فِي الصَّوْمِ وَهُوَ أَن يَصُومَ يَوْمَيْنِ أَوْ أَكْثَرَ، وَلاَ يَأْكُلَ وَلاَ يَشْرَبَ بَيْنَهُمَا

## విసాల్ ఉపవాసం పాటించటం నిషిద్ధం. విసాల్ ఉపవాస మంటే రెండు లేక అంతకంటే ఎక్కువ రోజులు నిర్విరామంగా ఏమీ తినకుండా త్రాగకుండా ఉపవాసం ఉండటం

١٧٦٦ ـ عَنْ أَبِي هُرَيْرَةَ وَعَائِشَةَ رَضِيَ اللهُ عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنِ الْوِصَالِ. متفقٌ عليه.

1766. హజ్రత్ అబూహురైరా మరియు ఆయిషా (రజి.అన్‌హా)ల కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) విసాల్ ఉపవాసం పాటించవద్దని వారించారు.
(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని సౌమ్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని సియామ్ ప్రకరణం)*

١٧٦٧ ـ وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الْوِصَالِ. قَالُوا: إِنَّكَ تُوَاصِلُ؟ قَالَ: «إِنِّي لَسْتُ مِثْلَكُمْ، إِنِّي أُطْعَمُ وَأُسْقَى» متفقٌ عليه، وهذا لفظ البُخاري.

1767. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) విసాల్ ఉపవాసాలు పాటించవద్దని వారించారు. అప్పుడు సహచరులు "మరి తమరు విసాల్ ఉపవాసాలు పాటిస్తారు కదా!" అని సందేహపడ్డారు. అందుకాయన, "నేను మీలాంటివాణ్ణి కాను. నాకు (దైవం తరపు నుండి ) తినిపించటం త్రాపించటం జరుగు తుంది" అని చెప్పారు.

(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని సౌమ్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని సియామ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

1) కొన్ని ధార్మిక విషయాల్లో దైవప్రవక్త (సఅసం)కు కొన్ని ప్రత్యేక ఆదేశాలు ఇవ్వబడ్డాయి. వాటిని ఆయన తప్పనిసరిగా పాటించవలసి ఉండేది. అయితే ఆయన అనుచర సమాజం (ఉమ్మత్) కోసం మాత్రం అవి తప్పనిసరి (వాజిబ్) కావు. వీటిని 'ఆయనగారి ప్రత్యేకతలు'గా కూడా పేర్కొనటం జరుగుతుంది. దైవప్రవక్త (స)కు మాత్రమే పరిమితమైన ఇటువంటి ప్రత్యేకతలను ఇతరులు అనుసరించటానికి షరీఅత్‌లో అనుమతి లేదు. పైగా అలా చేయటం పాపంగా పరిగణించబడుతుంది. విసాల్ ఉపవాసాలు కూడా అటువంటి ప్రత్యేకతల్లోనివే. అసలు ఏమీ తినకుండా త్రాగకుండా నిరంతరంగా ప్రతిరోజూ ఉపవాసం పాటిస్తూ పోవటాన్ని విసాల్ అంటారు. అల్లాహ్ దైవప్రవక్త (సల్లం)కు ఓర్పు సహనాలకు సంబంధించి ప్రత్యేక శక్తిసామర్థ్యాలను ప్రసాదించాడు. వాటి మూలంగా ఆయన విసాల్ ఉపవాసాలు పాటించటానికి అనుమతి కలిగివుండేవారు. దీనికి భిన్నంగా సామాన్య మానవుల్లో వేరెవ్వరికీ అటువంటి శక్తిలేదు. కనుక ఇతరులు ఆ విధంగా నిరంతరాయ ఉపవాసాలు పాటించటానికి షరీఅత్ అనుమతించదు.

2) "నేను మీలాంటి వాణ్ణి కాను" అంటే అర్థం నాకు ఇవ్వబడిన ప్రత్యేకశక్తి మీకు ఇవ్వబడలేదు అని. అంతేగాని 'అసలు నేను మీలాంటి మానవుణ్ణే కాదు' అన్న అర్థం ఎంతమాత్రం కాదు. ఆ అర్థమే గనక తీసుకుంటే, ఆ భావం ఖుర్‌ఆన్‌లోని 'ఇన్నమా అన బషరుమ్ మిస్లుకుమ్' (నేనూ మీలాంటి మానవుణ్ణే) అన్న వాక్యానికి విరుద్ధం అవుతుంది.